ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 20 జనవరి 2025

నేటి కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నేడు కలెక్టరేట్ ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులంతా క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి నేడు కలెక్టరేట్ ప్రజావాణికి రావొద్దని సూచించారు.

ప్రతిపాదనలకే పరిమితం

- నెట్టెంపాడు ఎత్తిపోతల పనుల పూర్తిపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలి
- కృష్ణా నదిపై 100 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నిర్మించాలి
- జూరాలకు సీజన్ దాటిన తర్వాత ఒక్క క్యూసెక్కు నీరు కూడా రావట్లేదు
- విద్య, వైద్యరంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.. డాక్టర్ల కొరత వేధిస్తోంది
- పెండింగ్ బిల్లులను ఇస్తే.. కొత్త పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది
- రైతు భరోసా, పింఛన్లు, రేషన్ కార్డుల జారీపై ప్రజల నుంచి అధిక వినతులు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం గద్వాల జిల్లాకు గుండె కాయ వంటిది. దాదాపు రెండు లక్షల ఎకరాలకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాల్సి ఉంది. కానీ ఏళ్లుగా పనులు పూర్తి కావడం లేదు. ప్రతీసారి బడ్జెట్ పెట్టినా రివైజ్డ్ ఎస్టిమేషన్‌కే నిధులు సరిపోతున్నాయి. తాజాగా ఇంకా రూ.400 కోట్ల వరకు వాటికే నిధులు కావాలని ప్రతిపాదనలు చేశాం. ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల కట్టడి, గట్టు ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్ నిర్మాణం, జూరాల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు అందించడం, ఐదు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను నింపుకోవడం, 99, 100 ప్యాకేజీ పనుల పూర్తి.. అన్నింటికీ ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. కానీ నిధులు విడుదల కావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం గద్వాల జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై శ్రద్ధ వహించాలి. వెనుకబాటులో ఉన్న గద్వాల జిల్లాను ముందంజలో నిలిపేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. నిధుల విడుదల వేగంగా జరిగితేనే ప్రజలకు కావాల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేయడానికి వీలు ఏర్పడుతుంది' అని అంటున్నారు గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉంది?

గద్వాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేకత ఉంది. గత పదేళ్ల కాలంలో కొంత అభివృద్ధి చెందాయి. కానీ ఇంకా సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు లక్షల ఎకరాలకు నీరివ్వాలి. కానీ ప్రస్తుతం అంత మొత్తంలో నీరు అందించలేకపోతున్నాం. పెండింగ్ పనులు, ర్యాలంపాడు లీకేజీలతో సతమతం అవుతున్నాం. రానున్న రోజుల్లో సాగునీటి కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కే అవకాశం ఉంది.

జూరాల ఆయకట్టు ప్రశ్నార్థకమంటున్నారు?

జూరాల మొత్తం 11 టీఎంసీల ప్రాజెక్టు. తొమ్మిదిన్నర టీఎంసీలు ప్రస్తుతం నింపుకుంటున్నాం. అందులో సిల్ట్ కారణంగా ఆరు టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంటున్నాయి. డెడ్ స్టోరేజీ పోను మిగులుతుంది తక్కువే. ప్రతీ ఏటా వేలాది టీఎంసీలు వరద సమయంలో సముద్రం పాలవుతోంది. సీజన్ దాటిన తర్వాత కర్ణాటకలో నిర్మించిన రోడ్ కం బ్యారేజీల వల్ల జూరాలకు చుక్క ఇన్‌ఫ్లో రావడం లేదు. దీనివల్ల ప్రాజెక్టు ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీని ఆధారంగానే ఉన్న ఎత్తిపోతల పథకాల పరిస్థితి కూడా రానున్న రోజుల్లో ఇబ్బందికరంగానే ఉంటుంది.

ర్యాలంపాడు లీకేజీలను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ర్యాలంపాడు రిజర్వాయర్.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి గుండెకాయ వంటిది. ఇందులో నాలుగు టీఎంసీల వరకు నీటిని నింపుకోవాలి. అప్పుడే 40 వేల ఎకరాలకు నీరు అందించవచ్చు. అలాగే ఇక్కడి నుంచే చిన్నోనిపల్లి, ముచ్చోనిపల్లి, నాగర్‌దొడ్డి, తాటికుంట, సంగాల ఆఫ్‌లైన్ రిజర్వాయర్లకు నీరు వెళ్లాలి. కానీ లీకేజీల కారణంగా కేవలం రెండు టీఎంసీలే నింపుకుంటున్నాం. రూ.120 కోట్లతో ఒకసారి, రూ.153 కోట్లతో మరోసారి, ప్రస్తుతం రూ.144 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. కానీ ఇప్పటివరకు ఆమోదం రాలేదు. లీకేజీలు అరికడితేనే ఆయకట్టుకు నీరందుతుంది. సీఎం రేవంత్‌రెడ్డికి, సాగునీటి పారుదల శాఖ మంత్రికి విన్నవించినా పనులకు మోక్షం లభించడం లేదు.

జూరాలకు ప్రత్యామ్నాయం ఏంటి?

కృష్ణానదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులకు స్టోరేజీ సమస్య తీవ్రంగా

(మిగతా 6లో..)

ప్రజల్లోకి వెళ్లినప్పుడు ఎలాంటి డిమాండ్లు వస్తున్నాయి?

ప్రజలు ఎప్పుడూ అమలు కానీ వాటిని అమలు చేయాలని కోరుతుంటారు. ప్రస్తుతం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ఈ నెలలో నిధులు మంజూరవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అలాగే ఆరేళ్ల నుంచి కొత్త పింఛన్లు లేకపోవడం, పెంచకపోవడంతో ఆ డిమాండ్లు వస్తున్నాయి. రేషన్ కార్డులు కూడా ఎక్కువ మంది అడుగుతున్నారు. రైతు భరోసా, రేషన్‌కార్డులు త్వరలోనే జారీ అయ్యే అవకాశం ఉంది.



పాలమూరు యూనివర్సిటీ

న్యాక్ గ్రేడ్ -ఏ ప్లస్

గుర్తింపు దిశగా పీయూ

- ఈనెల 23, 24, 25 తేదీల్లో వర్సిటీలో న్యాక్ బృందం పర్యటన
- ఆరేళ్ల తర్వాత రెండోసారి రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మంచి గ్రేడ్ వస్తే యూజీసీ, రూసా నుంచి అధికంగా ప్రత్యేక నిధులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి, (ఆంధ్రజ్యోతి) 19: ప్రారంభంలో చాలీచాలని నిధులు, సిబ్బంది కొరతను ఎదుర్కొని, ఇప్పుడు అంచెలంచెలుగా ఎదుగుతున్న పాలమూరు యూనివర్సిటీ మరో ముందడుగు వేయబోతోంది. ఇప్పటికే ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్), యూజీసీ (యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్) 12బీ, పీసీఐ(ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా), ఎన్‌ఏఏసీ-బీ(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్-బీ గ్రేడ్ వంటి గుర్తింపు పొందిన వర్సిటీ న్యాక్ -ఏ గ్రేడ్ దిశగా ముందుకు సాగుతోంది. ఈనెల 23, 24, 25 తేదీల్లో న్యాక్ బృందం పీయూ పర్యటనకు రానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్ల పాటు నిధులు

దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల నాణ్యతా ప్రమాణాలు అంచనా వేసి, వాటికి తగిన గ్రేడింగ్ ఇచ్చేందుకు యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్(యూజీసీ) 1994లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ)ను బెంగళూరు కేంద్రంగా ఏర్పాటు చేశారు. న్యాక్ ఒక స్వయం ప్రతిపత్తి సంస్థ. ఇది దేశంలోని అత్యుత్తమ విద్యను అందించే విద్యా సంస్థలను ఎంపిక చేసి, వాటికి అవసరమైన నిధులను ఐదేళ్లపాటు ఇస్తుంది.

న్యాక్ మంచి గుర్తింపు రావాలంటే..

దేశంలోని ఏ యూనివర్సిటీకైనా న్యాక్

(మిగతా 6లో..)

వర్సిటీ ప్రత్యేకతలు

- పీసీఐ, ఎన్‌సీటీఈ, యూజీసీ 12బీ గుర్తింపు, న్యాక్ బీ గ్రేడ్ సాధించింది.
- మూడు సార్లు స్నాతకోత్సవాలు జరిగాయి.
- జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి.
- ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎంఉష) నిధులు రూ.100 కోట్ల మంజూరయ్యాయి.
- తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీపీఈసీఈటీ) నిర్వహణ అవకాశం దక్కింది.
- బేర్ ఫుట్ వాక్‌లో గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, కామర్స్‌లకు సంబంధించి రూ.1.10 కోట్లతో పరిశోధనలు జరుగుతున్నాయి.

క్రీడలకు పొలిటికల్ జోష్..

- యువతను ఆకట్టుకునే పనిలో నాయకులు
- జిల్లాలో పోటాపోటీగా క్రీడా టోర్నమెంట్లు
- స్థానిక ఎన్నికలపై ఆసక్తి

6

భూ హక్కులు దక్కేనా..?

- రెండు తరాలుగా సాగుచేస్తున్న గిరిజనులు
- పట్టాదారులుగా రాజవంశస్థులు
- ధరణికి ముందు గిరిజన రైతులే అనుభవదారులు
- 495 ఎకరాల 12 గుంటల భూమిపై సందిగ్ధం
- ధరణిలో రాజవంశస్థులు ఎస్టీ కేటగిరిగా నమోదు
- గిరిజనుల పాదయాత్రతో వేడెక్కిన రాజకీయం

6


లట్టుపల్లి తండా శివారు ప్రాంతంలో గిరిజన రైతులు సాగుచేసిన వరి

అమ్రాబాద్ అభయారణ్యంలో

పెద్దపులి గాండ్రింపు

గుండం ప్రాంతంలో సఫారీ పర్యాటకులకు ప్రత్యక్షం


అమ్రాబాద్ అడవిలో పెద్దపులి

మన్ననూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో సఫారీ టూర్‌కు వచ్చిన పర్యాటకులకు ఆదివారం మరోసారి పెద్దపులి కనిపించింది. టైగర్ స్టే ప్యాకేజీలో భాగంగా జంగల్ సఫారీ పర్యటనకు వచ్చిన ఏడుగురు ఫర్హాబాద్ మార్గం గుండా వ్యూ పాయింట్‌ను సందర్శించి తిరుగు ప్రయాణంలో గుండం వద్ద ఆదివారం సాయంత్రం డ్రైవర్ అనిల్, గైడ్ రామాంజనేయులు చెట్ల పొదల్లో పెద్దపులి ఉన్నట్లు గమనించి సఫారీ వాహనాన్ని నిలిపి పర్యాటకులకు ప్రత్యక్షంగా చూయించారు. డ్రైవర్ తన ఫోన్‌లో పెద్దపులి వీడియోను చిత్రీకరించారు. పర్యాటకులు ఓ వైపు పెద్దపులి గాండ్రింపునకు భయపడుతూనే, నేరుగా చూసినందుకు సంబురపడిపోయారు. ఈ ప్రాంతంలో ఫర్హా-6 అనే ఆడపులిని గ్రాండ్ మదర్‌గా నామకరణం చేయగా అది మూడు పులులకు జన్మనిచ్చిందని, ఈ ప్రాంతంలో నాలుగు పులులు సంచరిస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.

రంగాపూర్‌కు పోటెత్తిన భక్తులు

-నిరంజన్ షావలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

- జాతరలో మాంసం, మద్యానికి గిరాకీ

అచ్చంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాలకు ప్రతీకగా నిలిచే రంగాపూర్ నిరంజన్ షావలీ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాతరలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు పిల్లలను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జాతరలో సీకులు రుచి చూశారు. మాంసం, మద్యం దుకాణాలు కిటకిటలాడాయి.


దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


నిరంజన్ షావలీకి ప్రసాదం తీసుకువెళ్తున్న భక్తులు

నిరంజన్‌షావలీ దర్గా జాతరలో కిక్కిరిసిన జనం


జనసందోహంతో రద్దీగా మారిన ఉమామహేశ్వర ముఖద్వారం

మాడవీధుల్లో ఊరేగిన ఉమామహేశ్వరుడు

భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

అచ్చంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం పరమేశ్వరుడు సతీ సమేతంగా శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శమిచ్చారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాగణం జనసంద్రంగా మారింది. భోగమహేశ్వరం నుంచి కొండపైకి ఆర్టీసీ బస్సులను నడిపింది. కొండ దిగువనే వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా భక్తులు సులవుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు విశేషపూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రాంమూర్తి, వీరయ్య శాస్త్రీ, నీలకంఠ శాస్త్రీ తదితరులు ఉన్నారు.


మాడవీధుల్లో ఊరేగుతున్న పార్వతీపరమేశ్వరులు

బాధిత కుటుంబానికి

న్యాయం చేయాలి

అయిజ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన యాపదిన్నె గ్రామస్థులు

7

ట్రాఫిక్ జామ్..

పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ



అలంపూరు చౌరస్తా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ తర్వాత విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ఏపీ నుంచి హైదరాబాదు నగరానికి ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ సందర్భంగా సొంతుళ్లకు వెళ్లిన ప్రయాణికులు రాజధాని నగరానికి తిరుగు ప్రయాణం కావడంతో ఉండవల్లి మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆదివారం ఏపీలోని అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల, నందికొట్కూరు తదితర పట్టణాలు, గ్రామాలకు వెళ్లిన నగర వాసుల తిరుగు ప్రయాణంతో పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి.



ప్రతిపాదనలకే పరిమితం



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఒక్క టీఎంసీ నీటితో 10 వేల ఎకరాలకు నీరందించ వచ్చు. ఆయకట్టు భారీగా చూపించారు. కానీ ఆ మేరకు స్టోరేజీ రిజర్వాయర్లు లేవు. భవిష్యత్‌లో వరద నీటిని సద్వి నియోగం చేసుకోవాలంటే 100 టీఎంసీల సామర్థ్యంతో భారీ రిజర్వాయర్ ఉమ్మడి పాలమూరు జిల్లాకు అవసరం. లేకుంటే నీటి లభ్యత లేక ఇబ్బందులు ఎదురవుతాయి.

గట్టు ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచుతున్నారా?

గట్టు ఎత్తిపోతల పథకాన్ని ర్యాలంపాడులో రెండు టీఎంసీల పైన నిల్వ ఉన్నప్పుడు నీరు తీసుకునే విధంగా రూపొందించాం. ఇప్పుడు ర్యాలంపాడులోనే అంత స్టోరేజీ సాధ్యం కావడం లేదు. అయితే 40 వేల ఎకరాలకు నీరందించేందుకు రూ.2,500 కోట్లతో నాలుగు టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటికే 1.5 టీఎంసీ సామర్థ్యానికి సంబంధించి రూ.580 కోట్ల పనులు నడుస్తున్నాయి. 15 మెగావాట్ల సామర్థ్యంతో మూడు పంపులను ఇందుకోసం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

విద్యా, వైద్యరంగాల పరిస్థితి ఎలా ఉంది?

గద్వాలకు ఇప్పటికే మెడికల్ కాలేజీ వచ్చింది. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. బీసీ స్టడీ సర్కిల్ కూడా ఉంది. నర్సింగ్ కాలేజీ ఏర్పాటైంది. పీజీలో వివిధ కోర్సులను అమలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వస్తే విద్యా ప్రమాణాలు మరింత పెరుగుతాయి. అయితే ఆస్పత్రుల్లో మాత్రం డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. అడ్మినిస్ట్రేషన్ సరిగా లేదు. పనితీరు మారేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆస్పత్రుల్లో మందుల కొరత కూడా ఉంది. కిట్లు లేకపోవడంతో టెస్టులు బయటకు రాస్తున్నారు. ఎక్కువ రెఫర్ చేస్తున్నారు.

చిరకాల వాంఛ గుర్రంగడ్డ బ్రిడ్జీ పరిస్థితి ఏంటి?

గుర్రంగడ్డ దీవికి సంబంధించి గతంలోనే బ్రిడ్జి మంజూరైంది. కానీ పనులు సాగలేదు. ఇప్పుడు కాంట్రాక్టర్ మారారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. పనులు త్వరలో పూర్తి చేసే సంకల్పంతో ఉన్నాం. పనులు వేగంగా నడిస్తే త్వరలోనే అందుబాటులోకి వచ్చి, ప్రజల ఇబ్బందులు తీరుతాయి.

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

● రూ.1,96,076 ఆదాయం

పెద్దకొత్తపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల్, వనపర్తి జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 25వేలకు మందికి పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకొని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఆదివారం హుండీ ద్వారా లక్షా 25వేల 466 రూపాయలు, టికెట్ల ద్వారా రూ.70వేల 610లు మొత్తం 1,96,076 రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

నందికొట్కూరు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నాయినోనిపల్లి మైసమ్మ దేవతను నందికొట్కూర్ ఎమ్మెల్యే గురువయ్య దర్శించుకొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్ యా దవ్, దేవాదాయ శాఖ సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు.

దాడి చేసి ముగ్గురిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అకారణంగా సందీప్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రామాలయం దగ్గర సందీప్ అనే వ్యక్తిపై శేఖర్, సాయి, ప్రశాంత్‌లు ముగ్గురు కలిసి అకారణంగా శనివారం సాయంత్రం దాడి చేశారు. ఈ సంఘటనపై ఆదివారం సందీప్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.



పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ద్వారం



పాలమూరు యూనివర్సిటీ పరిపాలన భవనం

న్యాక్ గ్రేడ్ -ఏ ప్లస్ గుర్తింపు దిశగా పీయూ

(5వ పేజీ తరువాయి)

గుర్తింపు రావాలంటే వర్సిటీకి కావాల్సిన అన్ని రకాల వసతులు ఉండాలి. ముఖ్యంగా అధ్యాపకుల బోధన, మూల్యాంకనం, పరిశోధన, హాస్టల్ వసతులు, పర్యావరణం, విధానపరమైన అంశాలు, పరిపాలన నిర్వహణ, నూతన ఆవిష్కరణలు తదితర అంశాలను న్యాక్ బృందం పరిశీలించి, మార్కులను కేటాయిస్తుంది. వర్సిటీలోని అన్ని రకాల వసతులను పరిగణలోకి తీసుకొని మొత్తం 1,000 మార్కులకుగాను లెక్కిస్తారు. ఇందులో యూనివర్సిటీ పొందిన మార్కులను క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ల ఆవరేజ్(సీజీపీఏ)లో లెక్కిస్తారు.

ఐదు నుంచి 20 కోర్సులకు..

పాలమూరు యూనివర్సిటీ ప్రారంభంలో ఐదు కోర్సులతో ప్రారంభమై, ప్రస్తుతం 20 కోర్సులతో నడుస్తోంది. గతంలో ఎనిమిది మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా, ప్రస్తుతం 18 మంది రెగ్యులర్, 274 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది తొమ్మిది మంది రెగ్యులర్, 180 మంది తాత్కలిక పద్ధతిలో పని చేస్తున్నారు. స్పోర్ట్స్, లైబ్రరీ, హాస్టల్ వసతులు ఉన్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి లేనివిధంగా నాలుగు పీజీ సెంటర్లలో హాస్టల్ వసతులు ఉన్నాయి. పచ్చని వాతావరణం ఉంది.

ఐదేళ్లలో సాధించిన ప్రగతి

వర్సిటీలో ఐదేళ్లలో పరీక్షల నిర్వహణ భవనాన్ని నిర్మించారు. దాంతో పాటు వీసీ రెసిడెన్సీ, గెస్ట్‌హౌస్, పరిశోధన భవనం, సింథటిక్ ట్రాక్ నిర్మించారు. బయో డైవర్సిటీని ఏర్పాటు చేశారు. ఐదు కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. న్యాయ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల భవనాలను నిర్మిస్తున్నారు. వచ్చే అకాడమిక్ నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. రెండు ఎకరాల్లో ఔషధ మొక్కలను సాగు చేస్తున్నారు.

మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నా..



యూనివర్సిటీకి కావాల్సిన వసతులను ఒక్కొక్కటిగా సమకూర్చాం. 2018-19లో మొదటిసారి న్యాక్ బీ గ్రేడ్ వచ్చింది. ఆ గ్రేడ్‌తో రూసా (రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్) నుంచి రూ.20 కోట్ల నిధులు వచ్చాయి. వాటితో యూనిర్సిటీ కొత్త భవనాలను నిర్మించాము. ఈసారి ఏ ప్లస్ గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నా. వర్సిటీలో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులు ఉన్నాయి. ప్రధానంగా మంచి ప్రకృతి వాతావరణంలో ఉంది. కొత్తగా లా, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనలో మనం ముందున్నాం.

- ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, వైస్ చాన్సలర్

సర్వం సిద్ధం చేశాం



యూనివర్సిటీలో న్యాక్ పర్యటన కోసం సర్వం సిద్ధం చేశాం. గతంతో పోలిస్తే ఈసారి వసతులు, నాణ్యమైన విద్య, ఎక్కువ అర్హతలు గల అధ్యాపకులు, అల్మానక్ ఎగ్జామినేషన్, ఇయర్ క్యాలేండర్, విభాగాల వారీగా అన్ని ఏర్పాట్లు చేశాము. అధికారులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు, సిబ్బంది న్యాక్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడానికి చాలా కష్టపడ్డారు. ఈ సారి ఏ ప్లస్ గ్రేడ్ కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నా.

- ప్రొఫెసర్ చెన్నప్ప, రిజిస్ట్రార్

ఎత్తుకెళ్లాడు.. తెచ్చిపెట్టాడు..

● దొంగిలించిన బైక్‌ను మళ్లీ అక్కడే పెట్టిన దొంగ



ఎత్తుకెళ్లిన బైక్‌ను తెచ్చి పెట్టడంతో బాధితుడికి అప్పగిస్తున్న ఉండవల్లి పోలీసులు

అలంపూరు చౌరస్తా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ చికెన్ కొట్టు ముందు ఆపిన బైక్‌ను అందరి కళ్లుగప్పి ఎత్తుకెళ్లాడు ఓ బైక్ దొంగ. బైక్ పోయిన వ్యక్తి గాలించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఏమైందో ఏమో కానీ ఆ దొంగ ఎత్తుకెళ్లిన బైక్‌ను సరిగ్గా అదే స్థానంలో మరుసటిరోజు నిలిపేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన ఉండవల్లి మండల పరిధిలోని అలంపూరు చౌరస్తాలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల వివరాల మేరకు.. వనపర్తి జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మాన్యం అనే వ్యక్తి మేపుకోసం ఈ ప్రాంతానికి వచ్చాడు. శనివారం సాయంత్రం అలంపూరు చౌరస్తాలోని ఓ చికెన్ షాపు ముందు తాళంతో పాటు బైక్ నిలిపేసి చికెన్ కొట్టించుకుని తిరిగి వచ్చేలోపే బైక్ మాయం అయింది. స్థానికుల సాయంతో స్థానికంగా విచారించి ప్రయోజనం లేకపోవడంతో ఉండవల్లి పోలీసులను ఆశ్రయించాడు. బైక్ పోయిందన్న బెంగతో రాత్రంతా గడిపిన అతనికి మరుసటి రోజు చల్లని కబురు అందింది. గుర్తుతెలియని వ్యక్తి తస్కరించిన చోటే బైక్‌లో ఉన్న ఉల్లిగడ్డలతో సహా తాళంతో పాటు నిలిపేసి వెళ్లిపోయాడు. కాసేపటికీ గమనించి చికెన్ కొట్టు వెంకట్రావ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సదరు బైక్‌ను కానిస్టేబుల్స్ నాగేశ్, అబ్దుల్‌బాషాలు బాధితుడికి అందజేశారు. పోయిన బైక్ తిరిగి చేతికి రావడంతో ఆ గొర్రెల కాపరి ఆనందం వ్యక్తం చేశాడు.

పాలెం డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్

బిజినేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అటానమస్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ డాక్టర్ రాధాకుమారి డాక్టరేట్ పట్టా అందుకోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ రాములు, అధ్యాపకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉత్తర ప్రదేశ్‌లోని షహరాన్పూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ అవినీష్ జునేజి పర్యవేక్షణలో ఎగ్జామింగ్ ఇండియనైజేషన్ ఆఫ్ ఇంగ్లిష్ ఇస్ సోపియో లింగ్విస్టిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అంశంపై చేసిన ప్రత్యేక పరిశోధనకు రాధాకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. అభినందించిన వారిలో లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, నాగరాజు, సుష్మ, శివ, స్వప్న, నాగలింగం, వెంకటేష్, రవికుమార్, మహేశ్వర్ మనోజ్ ప్రకాష్ బాబు తదితరులు ఉన్నారు.

క్రీడలకు పొలిటికల్ జోష్

● యువతను ఆకట్టుకునే పనిలో నాయకులు

● జిల్లాలో పోటాపోటీగా క్రీడా టోర్నమెంట్లు

● స్థానిక ఎన్నికలపై ఆసక్తి



నేతువానిపల్లిలో బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (ఫైల్)

గద్వాల అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గడిచిన నెల రోజులుగా నిర్వహించిన క్రీడాపోటీలతో జిల్లాలో పొలిటికల్ జోష్ కనిపిస్తోంది. సహజంగా ప్రతీ యేటా దీపావళి సందర్భంగా కేటీదొడ్డి మండలంలోని పాగుంట వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలకు మొదలయ్యే వివిధ రకాల క్రీడా పోటీలు గద్వాల కోటలోని భూలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహోత్సవా ల వరకు కొనసాగడం ఆనవాయితీ. ఈ ఏడాది అందుకు పూర్తిగా భిన్నమైన వాతావరణంలో పట్టణంలోని వార్డుల్లో మొదలుకుని జిల్లాలోని మండల కేంద్రాలు, పలు మండలాల్లోని గ్రామ పంచాయతీల పరిధిలో ఏదో ఒక సందర్భాన్ని ఎంచుకొని క్రీడాపోటీలు నిర్వహిస్తుండటం ఆసక్తికరంగా మారింది. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగున్నాయని వస్తున్న వార్తల నేపథ్యంలోనే ఈ హడావిడి మొదలైనట్లు క్రీడాకారులు, క్రీడాభిమానులు, రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

స్థానిక ఎన్నికలపై గురి..

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న 245కు పైగా గ్రామపంచాయతీలకు త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ ఆశావాహులు ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్క గద్వాల పట్టణంలోనే దాదాపు 12కు పైగా వార్డుల్లో క్రీడాపోటీలు నిర్వహించగా మండల, గ్రామీణ ప్రాంతాల్లో అదేజోరు కొనసాగుతుండటం విశేషం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తమవుతూ అందుకు తొలి ప్రయత్నంగా ఈ తరహా పోటీలు నిర్వహిస్తున్నారని ప్రజల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ క్రీడల నిర్వహణ వల్ల రాజకీయంగా నిర్వాహకులకు ఏపాటి ఫలితం దక్కుతుందో భవిష్యత్ నిర్ణయించాల్సి ఉంది.



గద్వాలలో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్పర్సన్ సరిత (ఫైల్)

భూ హక్కులు దక్కేనా..?



పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన రైతులు

ఖిల్లాఘణపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజన లంబాడ రైతుల తలరాతలు మారడం లేదు. వీరు సాగు చేస్తున్న భూములు బహదూర్ రాజవంశస్థులు భూ రికార్డుల్లో పట్టాదారులుగా ఉండగా అనుభవదారుల కాలంలో మాత్రం గిరిజన రైతుల పేర్లు నమోదు చేశారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడి మాడ శివారులోని అటవీ భూములు రాజవంశస్థుల్లోని చివరి వారైనా రాజా మోహన్‌కరణ్ బహదూర్, షాపూర్ పరిధిలోని భూములు రాజాశ్యామ్ కరణ్ బహదూర్‌లపై మొత్తం 495 ఎకరాల 12 గుంటల భూమికి పట్టాదారుగా ఉన్నారు. మండలంలోని మామిడిమాడ ముందరి తండా, వెనికితండా, బక్కతండా, మేడిబాయి తండా, కర్నెతండా, షాపూర్‌తండా, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని లట్టుపల్లితండా, మిట్య తండా, చిన్న పీరు తండా, భీముని తండాలలోని గిరిజన రైతులు రెండు తరాల నుంచి బండరాళ్లను తొలగించి సాగు చేస్తు జీవనోపాధి పొందుతున్నారు. 44 సంవత్సరాలుగా భూములపై గిరిజన లంబాడ రైతులకు హక్కులు కల్పించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను అభ్యర్థిస్తున్నా నేటికీ వారి కళ నెరవేరడం లేదు.

ధరణిలో భూ వివరాలు రాజవంశస్థులవే..

మామిడిమాడ శివారులోని 369 నుంచి 414 వరకు గల సర్వే నెంబర్లలోని 463 ఎకరాల భూములను 153 కుటుంబాలు సాగు చేస్తు కాస్తు కాలం, అనుభవదారుల కాలంలో కొనసాగుతున్నారు. ఈ భూములు రాజ మోహన్‌కరణ్ బహదూర్, రాజాశంకర బహదూర్‌లు ధరణిలో పట్టాదారులుగా ఉన్నారు. షాపూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్లు 76, 80, 82, 103 మామిడి మాడ గ్రామ శివారులోని 414 సర్వే నెంబర్లలోని 35 ఎకరాల 12గుంటల భూమి రాజాశ్యామ్ కరణ్ బహదూర్‌పై ఉండడంతో 495 ఎకరాల 12 గుంటల భూమి రాజవంశస్థులపై ఉన్నట్లుగా తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో ఖాతా నెంబరు 313, 339లలో పట్టాదారుగా రాజా మోహన్‌కరణ్ బహదూర్, రాజాశంకరబహదూర్ పట్టాదారులుగా నమోదైంది. ఈ కేవైసీ స్టేటస్‌లో ఆధార్ కార్డు అందుబాటులో లేదని, రాజవంశస్థుల కులం కేటగిరి ఎస్టీగా నమోదు చేశారు. ధరణిలో తప్పుగా నమోదు చేసిన వివరాలపై సర్వత్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. భూమి హక్కుల కో సం మాత్రం రాజవంశస్థులు రావడం లేదు. 1973లో సీలిం గ్ యాక్టు ద్వారా జమీందా రులు, జాగీర్ధారులు, భూస్వాముల వద్ద ఉన్న వందలాది ఎకరాలు దున్నే వాడికి భూ మి అందించాలని ఉన్న భూ పట్టాల మార్పిడి జరగడం లే దు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఖాస్తుకాలం తొలగించడంతో భూమిపై హక్కులు దక్కేనా అని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

రాజుగారి భూములపై దళారుల, రియాల్టర్ల కన్ను పడింది. రాజవంశస్థులమని కొంత మంది దళారులు కలెక్టర్ కార్యాలయంలో, ఉన్నత అధికారుల వద్ద పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్ కార్యాలయానికి మాత్రం రాజవంశస్థులు ఎవరూ సరైన పత్రాలతో రావడం లేదు. గిరిజన తండాల్లోని రైతులకు సాగు చేస్తున్న పంట భూములకు పట్టాలిప్పిస్తామని ఖర్చులు ఉంటాయని చెప్పి కొంతమంది నాయకులు డబ్బులు సైతం వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

భూ పట్టాల సాధన కమిటీ

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న వనపర్తి ఆర్డీవో కార్యాలయం వరకు గిరిజన రైతులు పాదయాత్ర చేయడంతో రాజకీయ రంగు పులుముకుంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ నెల 17న ఎమ్మెల్యే మేఘారెడ్డి గిరిజన రైతులకు భూ పట్టాలు ఇప్పించడానికి ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మా తాతల కాలం నుంచి సాగుచేస్తున్నాం..



నా వయసు 84 సంవత్సరాలు, మా తాత తరాల నుంచి సాగు చేస్తున్న భూమిని నేను సాగు చేస్తున్నా... మేము సాగు చేస్తున్న భూములు రాజులకు చెందినవ ని అధికారులు చెప్తున్నారు. కానీ, భూములపై హక్కులున్నాయని రాజవంశీయులు నాచిన్న నాటి నుంచి ఎవరు రాలేదు.

- కేతావత్ దాసు, గిరిజన రైతు, మేడిబాయి తండా

భూ పట్టాలిప్పిస్తే మొక్కుతా..



మా తాతలు కష్టపడి భూములను సారవంతమైన భూములుగా మార్చారు. మేము వ్యవసాయంపై ఆధారపడి బతికేవాళ్లం. రైతుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదు. సమస్యను పరిష్కరించి భూములకు పట్టాలు ఇప్పించాలి.

- ఎం లక్ష్మి, మహిళా రైతు, కర్నె తండా

ఉన్నతాధికారుల అనుమతులు రావాలి



భూ ప్రక్షాళన సమయంలో మామిడిమాడ, షాపూర్ గ్రామ శివారు ప్రాంతాల్లో గల రాజా గారి భూములు 495 ఎకరాల 12 గుంటలకు సంబంధించి దస్త్రాలను కలెక్టర్, సీసీఎల్ ఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అధికారుల నుంచి అనుమతులు వస్తేనే రాజా వారి భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

- సుగుణ, తహసీల్దార్, ఖిల్లాఘణపురం

భక్తిశ్రద్ధలతో శేషవాహన సేవ



శేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సింగోటం లక్ష్మీనరసింహ స్వామి

కొల్లాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ పురోహితు లు ఓరుగంటి సంపత్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఊరేగించారు. శేష వాహన సేవలు తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రంగారావు, బీజేపీ జిల్లా నాయకులు తమటం సాయికృష్ణ గౌడ్, పురోహితులు సతీష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు

ఐక్యతతో అమరచింత నియోజకవర్గాన్ని సాధిద్దాం



అఖిలపక్షం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు/అమరచింత, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతో అమరచింత నియోజకవర్గ కేంద్రాన్ని సాధిద్దామని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అమరచింత పట్టణ కేంద్రంలోని డీఎంఆర్ ప్రభుత్వ పాఠశాలలో నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు తమ అభిప్రాయాలను వినిపించారు. 1952 నుంచి 2009 వరకు 52 సంవత్సరాల పాటు 12 మంది ఎమ్మెల్యేలుగా కొనసాగారు. అమరచింత నియోజకవర్గం అప్పట్లో ఆత్మకూరు, అమరచింత, నర్వ, ధన్వాడ, దేవరకద్ర మండలాలను కలుపుకుని 2009 వరకు నియోజకవర్గ కేంద్రంగా వెలసిల్లింది. 2009 నుంచి నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నియోజకవర్గాన్ని రద్దు చేశారు. నియోజకవర్గాన్ని రద్దు చేయడం సరికాదని, అప్పట్లో మేధావులు, అఖిలపక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేసినా.. పట్టించుకోలేదని తెలిపారు. అమరచింత నియోజక వర్గం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని అమరచింత అఖిలపక్షం నాయకులు ఆయా మండలాల నాయకులను కోరాలని తెలిపారు.

సీఎంను కలుస్తాం...

అమరచింతను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఇది వరకే మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిశామని, మరోసారి ఎమ్మెల్యేతో చర్చించి ఆయన సహకారంతో, అఖిలపక్షం నాయకులతో కలిసి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్నామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగరాజు గౌడ్ అన్నారు. కార్యక్రమంలో అమరచింత మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు లావణ్య, సింధు, రాజ్‌కుమార్‌తో పాటు అఖిలపక్ష నాయకులు భూషణం గౌడ్, మేర్వ రాజు, అరుణ్ కుమార్, మహంకాళి శ్రీనివాస్, నరసింహగౌడ్, వెంకటేష్, భాస్కర్, అబ్రహం, తిరుమలేష్, న్యాయవాది రాజజేందర్ ఉన్నారు.

లబ్ధిదారుల గుర్తింపు సర్వేపై సమీక్ష

బిజినేపల్లి : ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చేస్తున్న సర్వేపై అడిషనల్ కలెక్టర్ అమరేందర్ ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్ప, ఏవో నీతిరెడ్డి, ఎంపీవో నరసింహులు, ఏఈవోలు ఉన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట



రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీ పతకాలు సాధించిన అథ్లెట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో ఉమ్మడి జిల్లా అథ్లెట్లు 11 స్వర్ణ, 13 రజత, 9 కాంస్య పతకాలు సాధించారు. టోర్నీలో పతకాలు సాధించడం పట్ల జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌గౌడ్, పరశురాం అభినందించారు. జిల్లా ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులు మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ జాతీయస్థాయి టోర్నీలో మొదటి, రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులు పాల్గొనున్నారు.

పీయూ అధ్యాపకుడికి జాతీయ ఉత్తమ పురస్కారం



పీయూ వైస్ ప్రిన్సిపాల్, తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ మన్నెమోని కృష్ణయ్యకు జాతీయ స్థాయి సంక్రాంతి పురస్కారం అందజేస్తున్న హర్యాణి సకల కళావేదిక- గౌతమేశ్వర సాహితీ కళాసేవ సంస్థ సభ్యులు

పాలమూరు యూనిర్సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యానివర్సిటీ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, తెలుగు విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ మన్నెమోని కృష్ణయ్యకు జాతీయ స్థాయి సంక్రాంతి పురస్కారం-2025 అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలీం భవనంలో హర్యాణి సకల కళావేదిక- గౌతమేశ్వర సాహితీ కళాసేవసంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయి సంక్రాంతి ప్రతిభా పురస్కారం -2025ప్రదానోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'ఇంతకి నివ్వెవరు సంకలన ఆవిష్కరణ' మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలుగు అధ్యాపక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ కవి రచయిత డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, ప్రముఖ కవి రచయిత డాక్టర్ దూడపాక శ్రీధర్‌లు సంస్థ సభ్యులతో కలిసి ఆయనకు జాతీయస్థాయి సంక్రాంతి పురస్కారం-2025ను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ దూడపాక శ్రీధర్ మాట్లాడుతూ అధ్యాపక రంగంలో, సాహిత్యం రంగంలో, తెలుగు భాషలో చేసిన సేవలకు గాను డాక్టర్ మన్నెమోని కృష్ణయ్యకు ఈ పురస్కారం అందజేశామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య సంతోషాన్ని వ్యక్తపరుస్తూ సంస్థవారికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయా స్థాయి అవార్డు అందుకున్నందుకు గాను డాక్టర్ మన్నెమోని కృష్ణయ్యను పాలమూరు యూనివర్సిటీ అధికారులు, పీయూ అధ్యాపకులు, ఉద్యోగులు విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. హర్యాణి సకల కళావేదిక- గౌతమేశ్వర సాహితీ కళాసేవసంస్థ, అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ముఖ్యవక్తలు డాక్టర్ దీక్షితుల సుబ్రమణ్యం, పొర్ల వేణుగోపాల్, యనమండ్ర వరలక్ష్మి, వి.కె.కళాధర రావు, బూర్ల లక్ష్మీనారాయణ అరిసేనపల్లి శ్రీనువాస్, తెలంగాణ ఉద్యమకారులు కుంచల లావణ్య, బువ్వహరీష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- అయిజ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన యాపదిన్నె గ్రామస్థులు



అయిజ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన యాపదిన్నె గ్రామస్థులు

అయిజ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయిజ పోలీస్‌స్టేషన్ ముందు ఆదివారం సాయంత్రం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. న్యాయం చేయాలంటూ యాపదిన్నె గ్రామానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో స్టేషన్‌కు రావటం జరిగింది. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాలలోకి వెళితే శనివారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వెంకటాపూర్ గ్రామ సమీపంలో భారత్‌బాల రహదారి నిర్మాణ పనులకు వాడుతున్న టిప్పర్ ఢీకొట్టిన సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న యాపదిన్నె గ్రామానికి చెందిన దావీద్ మృతి చెందాడు. ఈ విషయమై ఎస్‌ఐ విజయ్ కుమార్ రాత్రి సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. ఆదివారం సాయంత్రం పెద్ద మొత్తంలో యాపదిన్నె గ్రామస్థులు అయిజ పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. ఒకరి చావుకు కారణమైన భారత్‌మాల కంపెనీ యాజమాన్యం, ఉద్యోగులు స్పందించటం లేదని ఈ విషయంలో మాకు న్యాయం చేయాలని స్టేషన్‌ను ముట్టడించారు. కుటుంబంలో ఒకరి కోల్పోయి శోఖ సముద్రంలో ఉంటే న్యాయం చేయరేంటని ప్రశ్నించారు. భారత్‌మాల ఉద్యగులు స్పందించటం లేదు. ఈ విషయంలో న్యాయం చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని స్టేషన్‌ను ముట్టడించారు. ఈ విషయంలో శాంతినగర్ సీఐ టాటాబాబు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌లు నచ్చచెప్పటంతో సమస్యల సద్దుమణిగింది.

కేసు నమోదు సీఐ టాటాబాబు

శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాపదిన్నె గ్రామానికి చెందిన దావీద్ (28) మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్గానికి పంపటం జరిగింది. గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం ఉన్నది. సోమవారం పూర్తి చేయటం జరుగుతుంది. మృతుని భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగింది. ప్రస్తుతం టిప్పర్ డ్రైవర్ పరారిలో ఉన్నారు. త్వరగా పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గట్టు చెరువులో పడి రైతు మృతి



జక్కుల తిమ్మప్ప (ఫైల్)

గట్టు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గట్టు మండల కేంద్రానికి చెందిన జక్కుల తిమ్మప్ప అనే రైతు గ్రామ సమీపంలో ఉన్న చెరువులో పడి మృతి చెందాడు. శనివారం రాత్రి గట్టు చెరువు దగ్గరకు వెళ్లగా ప్రమాదవ శాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోయే సరికి అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువు దగ్గరకు వెళ్లి చూడగా శవమై తేలి పడిఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు బయటకు తీసుక వచ్చి అంత్యక్రియలు చేశారు. ఈయనకు భార్య పిల్లలు ఉన్నారు.

గిరాకీలు లేక వ్యాపారం కుదేలు

- మండల కేంద్రాల్లో వ్యాపారుల అవస్థలు
- దుకాణాల ముందు టూలెట్ బోర్డుల ప్రదర్శన
- భారంగా మారిన అద్దెలు... సిబ్బంది జీతాలు



మధ్యాహ్నం సమయంలో గిరాకీలు లేక మూతపడిన దుకాణాలు

ఖిల్లాఘణపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రాల్లోని దుకాణ దారులకు సంవత్సర కాలంగా గిరాకీలు లేకపోవడంతో వ్యాపారాలు కుదేలవుతున్నాయి. పండగ సీజన్‌లో గతంలో ఏ వ్యాపారం చేసినా వ్యాపారులకు కొద్దో గొప్పో లాభాలను తెచ్చి పెట్టేవి. గత సంవత్సర కాలంలో ఏ ఒక్క వ్యాపారిని కదిలించినా వ్యాపారమే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై దుకాణాల అద్దెలు భారంగా మారడంతో పాటు దుకాణంలో పని చేసే సిబ్బందికి జీతాలు చెల్లించలేక వ్యాపారాలు డీలా పడటంతో మూసుకునే పరిస్థితి ఏర్పడిందని లబోదిబో మంటున్నారు. అద్దెలు తగ్గిస్తామని దుకాణదారులు ప్రాధేయపడిన వ్యాపారం చేయడానికి ముందుకు రావడం లేదు. బస్టాండ్‌ల పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో దుకాణాల ముందు టూ లెట్ బోర్డులు ప్రదర్శిస్తున్నారు. ఆరు నెలలైనా దుకాణం కిరాయి కోసం ఎవరూ రావడం లేదని దుకాణదారులు వాపోతున్నారు.

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రాల్లో వ్యాపారాలు సజావుగా సాగాలంటే రైతుల ఆర్థిక పరిస్థితి బాగుండాలి. పంట సాగు రైతులకు పెట్టుబడి భారం పెరగడంతో పాటు పంట చేతికి వచ్చే సమయంలో తెగుళ్లు, అకాల వర్షాలతో దిగుబడి తగ్గిపోవడంతో వ్యవసాయ పెట్టుబడులు రాబట్టలేక పోతున్నామని దుకాణాల్లో వస్తు సామగ్రి కొనే పరిస్థితి లేకుండా పోయింది. రైతుల ఆర్థిక పరిస్థితి సైతం పరోక్షంగా వ్యాపారాలపై ప్రభావం చూపుతోంది.

● సిబ్బందికి జీతాలు ఇవ్వలేక మూతపడుతున్న వ్యాపారాలు

దుకాణదారులకు గిరాకీ లేకపోవడంతో వ్యాపార సంస్థలన్నీ డీలా పడుతున్నాయి. దుకాణాల అద్దెలు సిబ్బందికి జీతాలు చెల్లించలేక వ్యాపారస్తులు, ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపార వాణిజ్య సముదాయాలు దుకాణాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బోణీ కూడా కావడం లేదని కొంతమంది వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతం కంటే 60 శాతం వ్యాపారం తగ్గిపోయిందని వ్యాపారస్తులు కుమిలిపోతున్నారు. మండల కేంద్రాల్లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు సైతం దుకాణాలు మూసుకుని వెళ్లిపో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక వ్యాపారికి రెండు మూడు దుకాణాలు ఉన్నా ఒకే దుకాణానికి పరిమితం అవుతున్నారు. దుకాణాల అద్దె వర్కర్ల జీతాలు చెల్లించ లేక వస్త్ర దుకాణాలు మూతపడుతున్నాయి.

ప్రధాన రహదారుల పైదుకాణాల ముందు టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.



గిరాకీలు లేక నిర్మానుష్యంగా మారిన దుకాణాల సముదాయం

● స్థానిక వ్యాపారాలకు దెబ్బ

సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9, 2023 నుంచి మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చింది. దీనిని మహిళలు ఆసరా చేసుకుని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తూ స్థానికంగా కాకుండా పట్టణ ప్రాంతాలకు వెళ్లి వస్తువులు కొనుగోలు చేస్తుండటం గమనార్హం. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో మండల కేంద్రాల్లోని వ్యాపారాలపై ప్రభావం పడింది. జిల్లా కేంద్రాల్లో, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో షాపింగ్ మాల్స్ అందించే ఆఫర్లకు ఆకర్షితులై అవసరమైన వస్తువులను, వస్త్రాలను, కిరాణా సామగ్రి, నగలను కొనుగోలు చేయడానికి మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

తద్వారా స్థానికంగా కొనసాగుతున్న వ్యాపార వాణిజ్య సముదాయాలపై తీవ్ర ప్రభావం పడింది. వస్త్ర దుకాణాలు, కిరాణాలు, హోటళ్లు, చిరు వ్యాపారులు, దివాలా తీయడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

● బోణీ కావడం గగనంగా మారింది



మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం అమలు చేయడంతో వస్త్ర దుకాణంలో బోణీ కావడం గగనంగా మారింది. సంక్రాంతి పండుగ వేళ గతంతో పోలిస్తే వస్త్రాలు 40 శాతం కూడా అమ్మకాలు జరగలేదు. వ్యాపారాలు పూర్తిగా డీలాపడ్డాయి. అప్పులు చేస్తూ అద్దెలు వర్కర్ల వేతనాలు చెల్లించలేక కొంతమంది వస్త్ర వ్యాపారులు దుకాణాలను మూత పెడుతున్నారు. ఈ ఏడాది వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవు.

● సాక శ్రీనివాసులు, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు, ఖిల్లాఘణపురం

● మార్కెట్లో గిరాకీలు లేవు



గత సంవత్సర కాలంలో మార్కెట్‌లో గిరాకీలు లేవు. మహాలక్ష్మి పథకంతో మహిళలు పట్టణ ప్రాంతాలకు వెళ్లి వస్తు సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఆకర్షణీయమైన షోరూంల మోజులో మహిళా వినియోగదారులు ఆఫర్ల కోసం బస్సు ఎక్కి పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. మండల కేంద్రాల్లో లక్షల రూపాయల్లో పెట్టుబడులు పెట్టిన వ్యాపార సంస్థలపై ప్రభావం పడింది.

● ఎస్ఎల్ మురళీకృష్ణ, కిరాణ వ్యాపారి, ఖిల్లాఘణపురం

కొనసాగుతున్న బ్యాలెట్ పేపర్ ముద్రణ

- నామినేషన్ల ప్రక్రియ అనంతరం మండలాలకు తరలింపు
- సర్పంచులకు 12 గుర్తుల బ్యాలెట్, వార్డు సభ్యులకు 8 గుర్తుల బ్యాలెట్
- 2019లో 441 జీపీలలో 1119 మంది అభ్యర్థులు సర్పంచు పదవికి పోటీ
- 3838 వార్డు పదవులకు 2685 మంది అభ్యర్థుల పోటీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా అధికారులు ముమ్మరం చేశారు. అందులో భాగంగా గత డిసెంబర్ నెలలో ముసాయిదా ఓటరు జాబితాను అన్ని మండలాల్లో అభ్యంతరాలు స్వీకరించి ప్రదర్శించారు. గత నెల చివరి వారంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సర్పంచులకు, వార్డు సభ్యులకు ఎన్నికల గుర్తులు కేటాయించింది. సర్పంచు అభ్యర్థులకు 30 గుర్తులు. వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయిస్తూ జిల్లాలకు పంపించింది. అందులో నోటా గుర్తును కూడా పొందుపర్చింది. బ్యాలెట్ పేపర్ ముద్రణ కోసం ఇదివరకే మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్ పక్రియను పూర్తి చేశారు. తక్కువ టెండర్ కోడ్‌చేసి గతంలో ముద్రించిన అనుభవం ఉన్న రెండు సంస్థలకు ముద్రణ బాధ్యతను అప్పగించారు. ఎన్నికల కమిషన్ నుంచి ఖాళీగా వచ్చిన బ్యాలెట్ రిమ్స్‌ను బందోబస్తు మధ్య ప్రింటింగ్ కేంద్రాలకు తరలించారు. గురువారం నుంచి బ్యాలెట్ పేపర్‌ను ముద్రించిడం ప్రారంభించారు. ముద్రణ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తికానుంది. ముద్రించిన బ్యాలెట్ పేపర్‌ను గోడౌన్‌లలో భద్రపర్చనున్నారు. సర్పంచు అభ్యర్థుల గుర్తులను పింక్ కలర్ పేపర్‌లో ముద్రించనున్నారు. వార్డు సభ్యుల గుర్తులను వైట్ పేపర్‌లో ముద్రించనున్నారు. సర్పంచుల 30 గుర్తుల్లో 11 ప్లస్ నోటాతో 12 గుర్తులను ముద్రిస్తారు. వార్డు సభ్యుల గుర్తులు ఏడు ప్లస్ నోటాతో ఎనిమిది గుర్తులను ముద్రిస్తారు. గతంలో వచ్చిన నామినేషన్ల ఆధారంగా గుర్తుల ముద్రణ కొన సాగుతుంది. 2019 సర్పంచు ఎన్నికల్లో సర్పంచు పదవికి 441 గ్రా మ పంచాయతీలలో 1119 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 3838 వార్డులకు గాను 2685 మంది అభ్యర్థులు పోటి పడ్డారు. అ భ్యర్థుల నామినేషన్ల ప్రకారం 2 ప్లస్(నోటా) 1, 3ప్లస్1 (నోటా) గుర్తులను ముద్రిస్తారు. 11 గుర్తులకు మించి ఏదైనా గ్రామ పంచాయతీలలో అభ్యర్థులు పోటీలో ఉంటే అప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన 30 గుర్తుల నుంచి సభ్యుల సంఖ్యాపరంగా బ్యాలెట్ పేపర్‌ను అప్పుడు ప్రత్యేకంగా ముద్రిస్తారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా నిర్వహించడానికి అధికారులు స ర్వం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా 12 మంది ఎన్నికల ప్ర త్యేక అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి నియమించా రు. వారితో పాటు స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను నియమించారు. వీరితో పాటు పీవోలను. ఏపీవోలను నయమించాల్సి ఉంటుంది. వా రిని త్వరలోనే నియమించి ఎన్నికల నిర్వహణ పట్ల శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తంగా పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది.

● బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రారంభించాం



గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ ముద్రణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ప్రారంభించాం, ముద్రణ వారం రోజుల్లో పూర్తికానుంది. ముద్రించిన బ్యాలెట్ పేపర్‌ను గోడౌన్‌ల లో పోలీసు భద్రతమధ్య నిల్వ చేస్తాం. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యేనాటికి మండలాలకు పంపిణీ చేస్తాం. గత ఎన్నికల్లో వచ్చిన నామినేషన్ల ఆధారంగా బ్యాలెట్ పేపర్ ముద్రణ కొనసాగుతుంది. 2019లో 441 గ్రామ పంచాయతీల్లో సర్పంచు పదవికి 1119 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 3838 వార్డులకు 2685 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సర్పంచుల బ్యాలెట్ పింక్ కలర్ నోటాతో పాటు 11 గుర్తులు ముద్రిస్తాం. వార్డు సభ్యుల గుర్తులు వైట్ పేపర్‌లో నోటాతో పాటు ఏడు గుర్తులు ముద్రిస్తాం. ఏదైన గ్రామ పంచాయతీలో ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉంటే ఎన్నికల కమిషన్ సూచ నల మేరకు ప్రత్యేక బ్యాలెట్‌ను ముద్రిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వెలువరించిన నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం.

- పార్థసారథి, డీపీవో , మహబూబ్‌నగర్

పోలీసుల అదుపులో గుప్తనిధుల దుండగులు

లింగాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో గుప్త నిధుల కోసం పూజలు నిర్వహించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల కేంద్రమైన లింగాల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో లింగాలకు చెందిన కాక పర్వతాలుతో పాటు బల్మూరు, నాగర్‌కర్నూల్, హైదరాబాదుకు చెందిన వ్యక్తులు తెల్లవారుజామున పూజలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ తవ్వకాలలో భాగస్వాములుగా ఉన్న ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడు పదుల వయసులో ఆత్మీయ సమ్మేళనం

- కర్నూలు మెడికల్ కాలేజీ 1968 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం
- లేపాక్షి కూల్‌ప్యాలేస్‌లో అపూర్వ కలయిక
- అనంతరం జోగుళాంబ అమ్మవారి దర్శనం



జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయ ప్రాంగణంలో 70ఏళ్ల వయస్సులో కలుసుకున్న కర్నూలు మెడికల్ కాలేజీ(1968) పూర్వపు విద్యార్థులు

అలంపూరు చౌరస్తా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వారంతా 1968లో కర్నూలు మెడికల్ కళాశాలలో ఒకేసారి ప్రవేశించి చదివిన నాటి విద్యార్థులు.. నేడు వివిధ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో, దేశాల్లో డాక్టర్ వృత్తి చేస్తూ జీవిస్తున్న విద్యార్థులు. వారి స్నేహానికి పునాదులు వేసిన ఆ కళాశాల సాక్షిగా ప్రతి రెండేళ్లకోసారి కలుసుకుంటున్నారు. స్నేహానికి ఉన్న పవిత్రతను చాటుతున్న ఆ వృద్ధ స్నేహితులు ఆదివారం పుల్లూరు టోల్‌గేట్ వద్ద లేపాక్షి కూల్ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు. 1968 బ్యాచ్‌లో 62 మంది విద్యార్థులం ఉండగా తామంతా ప్రతీ రెండేళ్లకోసారి ఓ అందమైన వాతావరణంలో కలుసుకు నేందుకు అమెరికా, లండన్, నేపాల్, దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న స్నేహితులమంతా వస్తుంటా మని అనస్తీషియా డాక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని ఒక్క స్నేహమేనని ఆయన అన్నారు. గత మూడు రోజుల క్రితం వారంతా కర్నూలు నగరానికి చేరుకున్నామని, చివరి రోజైన ఆదివారం జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నామన్నారు. ఈరోజు రాత్రి ఎవరి ప్రాంతాలకు వారు వెళ్లిపోతున్నందుకు బాధగా ఉందని తెలిపారు. అందరం 72నుంచి 75 వయస్సులోపు ఉన్నామని ఇలా కలుసుకున్న ప్రతిసారి మా వయస్సును మరిచి ఎంజాయ్ చేస్తామని తెలిపారు. విందు అనంతరం వారంతా ఐస్క్రీంలు రుచి చూశారు.

బస్సులో టికెట్ పంచాయితీ

- అచ్చంపేటకు వచ్చేటప్పుడు రూ 220, హైదరాబాద్ వెళ్లేటప్పుడు రూ.330



సిబ్బందితో గొడవ పడుతున్న ప్రయాణికుడు

అచ్చంపేటటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు ఒకే దూరానికి ఆర్టీసీ బస్సుల్లో చార్జీ వసూల్‌లో తేడా కొట్టడం ఓ ప్రయాణికుడు ఆర్టీసీ సిబ్బందితో గొడవకు దిగడంతో బస్సును స్టేషన్ వరకు తరలించిన సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సు టికెట్ ధర రూ 220 వసూలు చేశారు. ఆ ప్రయాణికుడు రంగాపూర్ జాతరను ముగించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణంలో అచ్చంపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఆర్టీసీ సిబ్బంది టికెట్ ధర రూ.330 అనడంతో ప్రయాణికులు ఒక్కసారి ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదే విషయంపై సిబ్బందితో ప్రయాణికులు గొడవకు దిగారు. ఈ పంచాయతీ పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. బస్సును తిరిగి మళ్లీ బస్టాండ్‌కు తీసుకువచ్చారు. ఈ విషయమై డిపో మేనేజర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు వెళ్లే రూట్‌లో సిటీ బస్సులు, మన డిపోవి కలిపి అదనంగా బస్సులు నడపవలసి వస్తుంది. వాటికి మాత్రమే అదనంగా చార్జీలు వసూలు చేయడం జరిగిందన్నారు. రెగ్యులర్ బస్సులకు మేం పెంచలేదన్నారు. నేటితో అదనపు చార్జీలు ముగుస్తుందన్నారు. మరుసటి రోజు నుంచి ఎలాంటి అదనపు బస్సు చార్జీలు ఉండవన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉప్పునుంతల వాసులకు గాయాలు

ఉప్పునుంతల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి దైవ దర్శనం కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో డీసీఎం బోల్తా పడిన సంఘటనలో ఉప్పునుంతల మండల పరిధిలోని దేవదారికుంటతండా గ్రామానికి చెందిన బొల్లె లక్ష్మయ్య, రేణుక, సుజాతలకు స్వల్ప గాయాలైనట్లు వారి బంధువులు తెలిపారు. బొల్లె లక్ష్మయ్య, బిడ్డ, అల్లుడు హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ కాలనీలలో నివాసముంటున్నారు. లక్ష్మయ్య మనుమరాలు పుట్టు వెంట్రుకల కోసం యాదాద్రికి డీసీఎంలో శనివారం వెళ్లి ఆదివారం తిరుగు ప్రయాణంలో ఘట్‌కేసరి గట్టుమైసమ్మ వద్ద డీసీఎం అదుపు తప్పి బోల్తా పడటంతో లక్ష్మయ్య, రేణుక, సుజాతకు స్వల్ప గాయాలైనట్లు వారి బంధువులు తెలిపారు. గాయాలైన వారిని ఘట్‌కేసర్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

సింగోటం ఆలయ పరిసరాల్లో వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

కొల్లాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయ గుండం సమీపంలో ఉన్న కాల్వలో నీటిలో పడి వ్యక్తి చెందిన సంఘటన చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఏదిరపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు(35) ఈ నెల 17వ తేదీన సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యాడు. జాతరలో గుండు చేయించుకుని మొక్కులు చెల్లించుకున్న శ్రీనివాసులు ఈ నెల 17న సాయంత్రం నుంచి కనబడుట లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించగా సింగోటం శ్రీవారి గుండం సమీపంలో ఉన్న నీటి కాల్వలో శ్రీనివాసులు మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆంజనేయులు

వెల్దండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నియోజకవర్గ వడ్డెరసంఘం అధ్యక్షునిగా మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరిలు ఆంజనేయులుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ల కాలంగా అపరిష్కృత సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, శ్రీను, గణేష్, శారద, వెంకటేష్ ఉన్నారు.

సమగ్ర సర్వేను బహిర్గతపర్చాలి

- బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్ యాదవ్

పెద్దకొత్తపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సర్వే వివరాలను ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వేను రెండు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను తక్షణమే బహిర్గతపర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీని అమలుపర్చాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వారికి అవకాశం కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

వెల్దండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఈనెల 17న పరమేష్ నాయక్ తన తల్లి బిచ్చానితో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌నుండి అచ్చంపేటకు వెళ్లాడు. ఈ క్రమంలో వెల్దండ సమీపంలోని కేఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద పరమేష్ నాయక్ వాహనం కంటే ముందుగా అదేదారిలో ద్విచక్రవాహనంపై వెళుతున్న కోడేరు మండలం ఎత్తం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండా వాహనాన్ని ప్రక్కకు తిప్పాడు. దీంతో వెనుకనున్న పరమేష్‌నాయక్ వాహనం పవన్‌కుమార్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో పరమేష్‌నాయక్, బిచ్చానిలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీయూడబ్ల్యూజేఐ డివిజన్ అధ్యక్షుడిగా సాయిబాబు

అచ్చంపేటటౌన్,జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజేఐ అచ్చంపేట డివిజన్ అధ్యక్షునిగా సాయిబాబును రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు నాయక్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్ణయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాజు, శ్రీనివాసరావు, వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, కోశాధికారిగా లక్ష్మీపతి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, వెంకట్, తాహెర్, హరీష్‌లతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'వెల్టూరు మండలం కోసం తీర్మానాలు చేయాలి'

ఉప్పునుంతల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉప్పునుంతల మండల పరిధిలోని తూర్పు భాగాన ఉన్న 14గ్రామాల ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం వెల్టూరును మండలం చేయాలని వెల్టూరు మండల సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు మారం సురేష్ రెడ్డి ఆదివారం కోరారు. మండల సాధన వేగవంతం కావాలంటే ప్రతీ గ్రామం నుంచి తీర్మానాలు చేసి పంపాలని ఆయన కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సమన్వయంతో ముందు కెళ్లాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దకొత్తపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో పోలే లక్ష్మయ్య మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మడ్డి ఇమాన్‌గౌడ్ పరామర్శించారు. లక్ష్మయ్య దహన సంస్కారాల కోసం ఆదివారం కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పుట్ట రాములు, లచ్చగౌడ్, నాయకులు అబీబ్, ఎండి.నిరంజన్, నరేంద్రచారి, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పుట్ట రమేష్, జానకిరాములు, వడ్డె వెంకటస్వామి, ఆజామ్, వడ్డె లింగస్వామి, మారేడు నారాయణ, షబ్బీర్, బడేపాషా, పుట్ట చిన్నయ్య, బొల్లె ఉదయ్‌కుమార్, బొల్లె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

వంగూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం 4వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బాలస్వామి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సంబంధిత వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన ప్రభుత్వాలపై సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. మహాసభలను జయప్రదం చేసేందుకు మండలం నుంచి జనసమీకరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో శివరాములు, ఆంజనేయులు, అంజయ్య, కేశవులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవన శైలి మార్పు

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందినప్పుడే ప్రజల జీవన శైలి మారుతుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగదేవ్‌పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు. రూ. 20 లక్షలతో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే రైతు భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందనున్నాయన్నారు. అనంతరం గ్రామంలో శిథిలా వస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యేను పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో బ్రహ్మచారి, పీఆర్‌ఏఈ శివకృష్ణ, వల్లపురెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు వినోద్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.


నాగదేవ్‌పల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

రాష్ట్ర సాధనలో కళాకారులది కీలక పాత్ర

నాగర్‌కర్నూల్ టౌన్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో జానపద కళాకారుల పాత్ర కీలమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లహరి గార్డెన్‌లో జానపద కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రదేశాల్లో ప్రతిభ కనబరిచిన జానపద కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోమంలో ఎన్ని పోరాటాలు చేసినా కళాకారుల పాటలతోనే ప్రజల్లో చైత న్యం వచ్చిందన్నారు. అనంతరం జానపద కళా కారులు ఎమ్మెల్యేను శాలువా, జ్ఞాపికతో ఘనం గా సత్కరించారు. కార్యక్రమంలో జానపద కళా కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, జానపద కళా కారులు డప్పు స్వామి, పౌరాణిక నాటక కళాకారుడు డి.రాములు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 40 ఏళ్ల తర్వాత సమావేశమైన 1984-85 బ్యాచ్ విద్యార్థులు

బిజినేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వారంతా చిన్ననాటి బాల్యమిత్రులు. ఒకేచోట చదువుకున్నారు. పదవ తరగతి పూర్తయ్యాక కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు వ్యాపారాలు, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. మండలంలోని పాలెంలోని తోటపల్లి సుబ్రమణ్యం మెమోరియల్ హైస్కూల్‌లో 1984-85 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కె.హనుమంత్ రావు, గాడి సురేందర్‌లను శాలువా, పూలమాలలతో సన్మానించారు. దాదాపు 70 మంది విద్యార్థులు సమావేశానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ గౌడ్, గంధం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, సాధిక్ పాషా, రవి మాట్లాడుతూ చిన్నప్పుడు తరగతి గదిలో తోటి స్నేహితులతో, గురువులతో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని నవ్వుకున్నారు. అంతకు ముందు పాఠశాల వ్యవస్థాపకులు సుబ్బయ్య అయ్యగారి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పూర్వ విద్యార్థులు పుల్లారెడ్డి, శ్రీనివాస్ శర్మ, ఈశ్వరయ్య, సుందర్ రావు, నాగిరెడ్డి, శ్రీనివాసులు, నాగమణి, కల్పన, వరలక్ష్మి, వసుంధర, జయమ్మ, కాగితాల మురళి, దేవేందర్, సత్యం, విజయ భాస్కర్ రెడ్డి, కమ్రుద్దీన్ ఉన్నారు.


పాలెంలో సుబ్బయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

శివ మాల ధరించిన యువకులు

కందనూలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని యువత ఆధ్యాత్మిక వైపు పయనిస్తున్నారు. నీలకంఠేశ్వర సన్నిధానం యువత మహాశివ క్షేత్రం శ్రీశైలం దేవస్థానంలో శ్రీశైల దేవస్థాన ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీశైలం స్వామి సన్నిధిలో మండల శివదీక్ష మాలధరించారు. ప్రాచీన శివాలయం సోమశిలలో మండల శివ దీక్ష గురుస్వామి గుంపుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు కొండకింది మాధవరెడ్డి స్వామి, బొజ్జయ్య స్వామి, మూర్తిస్వామి, రాంబాబు స్వామి, శేఖర్ స్వామి, మల్లారెడ్డి స్వామి, శంకర్‌స్వామి పాల్గొన్నారు.


శ్రీశైలంలో శివ దీక్ష స్వీకరించిన శివస్వాములు

శబరిమలలో ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్ : అయ్యప్పమాల వేసి 42 రోజుల పాటు నిత్యం పూజలు చేసి ఆదివారం తెల్లవారుజామున ఇరుముడితో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఈనెల 16న ఉమామహేశ్వరంలో ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరిన ఎమ్మెల్యే ఆదివారం అయ్యప్పను దర్శించుకున్నారు. ఆయనతో పాటు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు కట్ట అనంత రెడ్డి, కుంద మల్లికార్జున్, సంతోస్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో దళిత అధికారులకు రక్షణ కరువు'

పెంట్లవెల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో దళిత అధికారులకు రక్షణ లేదని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు గోవురాజు, పీవీరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెంట్లవెల్లి మండల తహసీల్దార్‌ను రెవెన్యూ చట్టాలకు వ్యతిరేకంగా పని చేయమని స్థానిక నాయకులు ఒత్తిడి తేవడం దారుణమని అన్నారు. ఎలాంటి పేపర్స్ లేకపోయినా సర్టిఫికెట్స్ జారీ చేయాలని స్థానిక నాయకులు ప్రజాపాలన కార్యక్రమంలో అధికారుల ముందు అవమానంగా మాట్లాడారని వారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వెంకటేష్, వెంకటయ్య, ప్రకాష్, వెంకటస్వామి, పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

కల్వకుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మహిళ మృతి చెందినట్లు ఎస్‌ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన రేణమ్మ(56) కల్వకుర్తికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో కల్వకుర్తి నుంచి తమ స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా అనారోగ్యంతో వాంతులు చేసుకుంది. కల్వకుర్తిలోని శివాలయం సమీపంలో అనారోగ్యానికి గురైన రేణమ్మ వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. మృతురాలి కొడుకు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుపేదల ఆరోగ్యం కోసం కృషి

అచ్చంపేటటౌన్,జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ప్రజల ఆరోగ్యం కోసం లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోక్తాల వెంకటేష్ అన్నారు. లయన్స్ క్లబ్, హరిహర డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో డెంటల్ ఉచిత క్యాంప్‌ను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్ నాయక్ పర్యవేక్షణలో 160మంది రోగులకు చెడిపోయిన దంతాలను తొలగించారు. కార్యక్రమంలో సభ్యులు పోల శ్రీనివాస్, శివ శంకర్, నరసింహారావు, నరేష్, బాలాజీ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ఐక్య పోరాటాలు నిర్వహించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక వర్గాలపై పాలకులు అనుచివేత దోరణి తిప్పికొట్టేందుకు కార్మిక, కర్షక ఐక్యత పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవం నిర్వహించారు. ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ 1982 జనవరి 19న కార్మికులు, కర్షకులు కలిసి దేశ చరిత్రలో చైతన్యవంతమైన సమ్మెతో ఐక్య పోరాటం జరిగిందన్నారు. ఆదేస్ఫూర్తితో నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, నాయకులు మల్లేష్, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్, సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సుభాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి

25న సంగారెడ్డిలో బహిరంగ సభ

కొల్లాపూర్ : సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్నాయని ఆ పార్టీ మండల కార్యదర్శి శివవర్మ తెలిపారు. 25న జరగనున్న బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండీ సలీం, బాలపీరు, శాఖ కార్యదర్శులు వెంకటస్వామి, సత్యం, బాలయ్య, నాయకులు రామకృష్ణ, శివశంకర్, బాలకృష్ణ, మల్లేష్, రాముడు, రమణ, పకీర, శ్రీను, వీరయ్య, బిచ్చన్న, ఎల్లయ్య, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి

-డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్

తాడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రేషన్‌కార్డుల పరిశీలనకు సంబంధించి ఎక్కడా అలసత్వం వహించవద్దని జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నూతన రేషన్ కార్డుల కోసం ఏర్పాటు చేసిన దరఖాస్తుల పరిశీలన కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ దరఖాస్తుదారుని వద్దకు వెళ్లి కులంకషంగా పరిశీలించాలని సూచించారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్లడ్లు, రైతు భరోసా వంటి పథకాలకు సంబంధించి అధికారులను అడిగి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఏదేమైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఒకవేళ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిస్తే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో బ్రహ్మచారి, డీఎల్‌పీవో రామ్మోహన్‌రావు, కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి

చారకొండ : రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మర్రిపల్లిలో నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు యోగ్యం కాని భూములను క్షేత్ర స్థాయిలోగుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భరత్, సర్వేయర్ అనూష, ఏఈవో అనూష, జూనియర్ అసిస్టెంట్ శివకృష్ణ పాల్గొన్నారు.


తాడూరు ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్

కొనసాగుతున్న సర్వే

తెలకపల్లి : మండల పరిధిలోని పెద్దూరు, లక్నారం, బొప్పల్లి, గడ్డంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసాను తహసీల్దార్ జాకీర్‌అలీ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంలాల్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఏఈవో జ్యోష్న, కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కల్వకుర్తి : రైతు భరోసా సర్వేను క్షేత్రస్థాయి పకడ్బందీగా నిర్వహించాలని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంతో పాటు మండల పరిధిలోని తర్నికల్‌లో రైతు భరోసా సర్వే తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ కవిత, ఏవో సురేష్, సర్వే టీం సభ్యులు ఉన్నారు.

రైతు భరోసాపై ఆర్డీవో ఆరా

పెద్దకొత్తపల్లి : రైతు భరోసాపై కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ ఆదివారం అధికారుతో పెద్దకొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ జేకే.మోహన్, ఎంపీడీవో నాగేంద్రం, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగేషు పాల్గొన్నారు.

సాగులో లేని భూములను గుర్తించాలి

- అదనపు కలెక్టర్ అమరేందర్

తాడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసాకు సంబంధించి గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో సాగు యోగ్యం కాని భూముల గుర్తింపు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో సాగుయోగ్యం కాని భూములను, రహదారులను, లేఅవుట్లను, కేఎల్‌ఐ కాల్వలను, గుట్టలను వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం ఇంద్రకల్ గ్రామంలో పేద ముస్లిం కుటుంబానికి పెళ్లి కానుకగా ప్రముఖ సినీ దర్శకుడు, ప్రొడ్యూసర్ శంకర్ సమకూర్చిన పుస్తె, మెట్టెలు, నిత్యావసర సరుకులను అడిషనల్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


తాడూరులో తహసీల్దార్ కిరణ్మయితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అమరేందర్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గిరిజన యువకుల ప్రతిభ

మన్ననూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో 14వ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వారు ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో నల్లమల ప్రాంతానికి చెందిన ఇద్దరు గిరిజన యువకులు ప్రతిభ చాటి పతకాలు సాధించి జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. మన్ననూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు విస్లావత్ లక్ష్మణ్ ట్రిబుల్ జంప్‌లో బంగారు, షార్ట్‌పుట్‌లో రజత, 400 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాలు సాధించ గా, బేగంపేట విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తున్న అచ్చంపేట మండలం సూర్య తండాకు చెందిన ముడావత్ మురళి హైజంప్‌లో బంగారు, షార్ట్ పుట్‌లో రజత, 400 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాలు సాధించి మార్చిలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రజలు, సహచర ఉద్యోగులు వారిని అభినందించారు.


పతకాలతో లక్ష్మణ్, మురళి

ఆలయ నిర్మాణానికి రూ.90 వేలు వితరణ

బిజినేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆనందగిరి గుట్ట సమీపంలో స్వయంభువుగా వెలిసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి కత్తె ఈశ్వర్ కూతురు జన్మదినం పురస్కరించుకొని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 90 వేల ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణశిలతో నిర్మిస్తున్న అంజనీపుత్రుడి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. అనంతరం ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


బిజినేపల్లిలోని ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత కత్తె ఈశ్వర్ కుటుంబ సభ్యులు

బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ

చారకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు ఎల్క శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఏర్పాటు చేసిన ఎల్క శ్రీను సంతాప సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింత ఆంజనేయులు, బి. ఆంజనేయులు, మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బొల్లె జగన్, పలువురు నాయకులు ఎల్క శ్రీను చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు, రైతుల కోసం జరిగిన పోరాటాల్లో కీలక పాత్ర వహించిన వ్యక్తి శ్రీను అని అన్నారు. అలాంటి వ్యక్తి ప్రజల మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుప్పగండ్లలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ. 3 లక్షలతో ఏర్పాటుచేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే తమ ప్రధాన అజెండా అని తెలిపారు. నియోజకవర్గంలో తమ సంస్థ ద్వారా సుమారు 10వేల ఉచిత కంటిపరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే తనవంతుగా నెరవేరుస్తానని రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, రమేష్, సభ్యులు మల్లయ్య, రమేష్, కొండల్ ఉన్నారు.


కుప్పగండ్లలో నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి

కల్వకుర్తి : దైవభక్తితో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తిలోని హనుమాన్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న పోచమ్మ దేవాలయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, నాయకులు జగదీశ్, నరసింహ, రాజశేఖర్, శ్రీనివాసులు, బాలసాయిలు, లక్ష్మయ్య, బాలగౌడ్ పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- ఆబ్కారీ శాఖ కల్వకుర్తి సీఐ వెంకట్ రెడ్డి

ఊర్కొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆబ్కారీ శాఖ కల్వకుర్తి సీఐ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాల్యతండా, రెడ్యా తండాలో ఆబ్కారీ శాఖ అధికారులు దాడి చేసి 250 లీటర్ల బెల్లం పానకం, నాటు సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ నాటు సారా రహిత తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా ఆబ్కారీ శాఖ ముందుకు సాగుతోందన్నారు. నాటు సారా తయారీదారులు విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో విస్తృతంగా దాడులు చేస్తామని తెలిపారు. డీటీఎఫ్ ఎస్‌ఐ రాజేందర్, సిబ్బంది నార్య ఉన్నారు.

జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు


మార్చాల జడ్పీహెచ్‌ఎస్ 2004-05 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

కల్వకుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూల మాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. 20ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు వివిధ వృత్తుల్లో ఉన్నప్పటికీ తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు బాసు నాయక్, గోవర్ధన్, పూర్వ విద్యార్థులు ఉన్నారు.